క్లుప్తంగా

రేపు మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన ఈ నెల 6న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ, కో ఆప్షన్‌సభ్యులు, సర్పంచులు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సంబంధిత శాఖల వివరాలతో హాజరుకావాలని కోరారు.

నేత్రదానానికి ముందుకు రావాలి



నేత్రదానంపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యులు

సీఎస్‌పురం(పామూరు): నేత్రదానానికి యువత ముందుకు రావాలని పీహెచ్‌సీ డాక్టర్ సందిరెడ్డి మురళి అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళి నేత్రదానం ఆవశ్యకత వివరిస్తూ నేత్రదానం చేసి మరొకరికి చూపు ప్రసాదించాలని సూచించారు. నేత్రదానం వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా చేయవచ్చన్నారు. సీహెచ్ఓ మురళి, సుజన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

60 మందికి వైద్య పరీక్షలు

మర్రిపూడి: స్థానిక దళితవాడలో మర్రిపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి వీరబాబు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మంది రోగులను పరీక్షించి 25 మంది జ్వరపీడితులను గుర్తించారు. జ్వరం జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకినా, లక్షణాలు కనిపించినా వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు.

దుకాణ యజమానులు నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్

కనిగిరిరూరల్: ఎరువుల షాపుల యజమానులు, దుకాణదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఎరువుల షాపుల యజమానులతో, దుకాణదారులతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అక్రమ నిల్వలు ఉంచినా, ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించినా, నకిలీ, కల్తీ మందులు, ఎరువులు అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై టి.శ్రీరాం, వ్యవసాయ అధికారులు, ఎరువుల దుకాణ యజమానులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో మహిళ మృతి



స్వర్ణ మాధురి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సురేష్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని అక్కచెరువుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోటు శ్రీనివాస్ కోడలు స్వర్ణమాధురి బ్రెయిన్ స్ట్రోక్‌తో మంగళవారం మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం స్వర్ణమాధురి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్, పాడిబండ్ల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

టంగుటూరు: మండలంలోని జయవరం గ్రామ శివారున ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే..ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఒంగోలు నుంచి కొండపికి వెళుతుండగా జయవరం గ్రామ శివారున మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు వెంబడి కాలువలోకి దూసుకుపోయింది. ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా బస్సులో వారికి స్వల్ప గాయాలయ్యాయి.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

కనిగిరిరూరల్: విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక నాల్గవ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ సచివాలయ సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫిర్యాదుదారుల పట్ల, ప్రజలతో స్నేహభావంతో మెలగాలని సూచించారు.

తవ్వుకో..దోచుకో..

అధికార అండగా సహజ సంపదను తవ్వేస్తున్నారు. అనుమతులుండవ్..అడిగేవారుండరు..ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా తనిఖీ చేసి చేతులు దులుపుకోవడం..ఇదీ నియోజకవర్గంలో తెల్లరాయి తవ్వకాలు సాగుతున్న తంతు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పచ్చ గద్దలు ఇక్కడ వాలిపోయాయి. అనుమతులు లేకుండా ఇష్టారీతిన తవ్వేస్తూ లక్షల్లో అర్జిస్తున్నారు. అక్రమార్జన వ్యాపారంలో తలా పాపం తిలా పిడికెడు అన్న చందంగా అన్ని శాఖల అధికారులకు మాముళ్లు అందుతున్నాయి. దీంతో ఈ మాఫియా అక్రమ వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోతోంది.

- పీసీపల్లి మండలంలో ఇష్టారీతిన తెల్లరాయి అక్రమ తవ్వకం
- సహజ సంపదను దోచేస్తున్న పచ్చ నేతలు
- ఇతర ప్రాంతాల నుంచి పెట్టుబడులు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- అక్రమార్జనల్లో అధికారులకు వాటాలు..



తరలించేందుకు సిద్ధంగా ఉన్న తెల్లరాయి

కనిగిరిరూరల్/పీసీపల్లి: జిల్లాలో అనేక మండలాల్లో తెల్ల రాయి ఉన్నా కనిగిరి ప్రాంతంలో ఉన్న తెల్లరాయికి మంచి గిరాకీ ఉంది. ఇక్కడ గ్రేడ్ 1 రకం రాయి లభ్యమవుతుంది. దీంతో కనిగిరి నియోజకవర్గంలో తెల్లరాయి తవ్వకాలకే మైనింగ్ మాఫియా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. రెవెన్యూ, అటవీ ప్రాంతం అధికంగా ఉండటం, శివారు ప్రాంతం కావడంతో చైన్నై లాంటి ప్రాంతాలకు వైట్ క్వార్జ్(తెల్ల రాయిని)ను ఎక్కువగా తరలించే అవకాశం ఉంది. దీంతో , అధికార పార్టీ అండతో అక్రమార్కులు తవ్వేస్తున్నారు. స్థానిక టీడీపీ నేతల అండతో గుంటూరు, ఒంగోలు, నర్సారావుపేట ప్రాంతానికి చెందిన వారు ఇక్కడకు వచ్చి వైట్ క్వార్జ్ మైనింగ్ చేస్తున్నారు.

కనిగిరిలో గ్రేడ్ 1 రకంగా టన్ను రూ.7 వేలు పలికే రాయి దొరుకుతుండటంతో అక్రమ మైనింగ్ మాఫియా ఈ ప్రాంతంపై దృష్టి సారించారు. ఒక లారీకి 30 నుంచి 40 టన్నులు ఎగుమతి చేస్తారు. ఇక్కడి నుంచి రాత్రిళ్లు చెన్నై, విశాఖపట్నంకు తరలిస్తారు. అక్కడి నుంచి సముద్రమార్గాన ఇతర దేశాలకు తరలిపోతోంది. టన్నుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుండటంతో అక్రమార్కులు రేయింబవళ్లు అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు.

దాడులు అంతంతమాత్రమే..

అక్రమ మైనింగ్ తవ్వకాలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అధికారులు నిద్ర మత్తు నటిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, మైనింగ్, ఫారెస్ట్ అధికారులు తెల్లరాయి ఖనిజాల తవ్వకాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఫారెస్ట్ అధికారులు అడపాదడపా అక్కడక్కడా దాడులు చేస్తున్నా.. రెవెన్యూ అధికారులు మాత్రం అసలు ఆవైపే కన్నెత్తి చూడరు. ఇక మైనింగ్ అధికారులు ఫిర్యాదులు చేస్తే తప్పా.. కదలని దుస్థితి. ఇటీవల కనిగిరి, వెలిగండ్ల శివారు ప్రాంతాల్లో చీర్లదిన్నె, నాగిరెడ్డి కొండల మధ్య అటవీ బీట్ భూముల్లో ఒక గ్రామ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ అక్రమంగా మైనింగ్ తవ్వుతుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. భారీ స్థాయిలో తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. అయితే సుమారు 10 టన్నుల రాయి స్టాక్ మాత్రమే దొరకడంతో రూ.1.30 లక్షలు పెనాల్టీ వేసినట్లు తెలిసింది. పీసీపల్లిలో గుంటుపల్లి శివారు ప్రాంతాల్లో జోరుగు జరుగుతున్న తవ్వకాలపై స్థానికుల ఫిర్యాదుతో మాత్రమే వచ్చి మైనింగ్ అధికారులు పట్టుకున్నట్లు తెలిసింది.

మైనింగ్ మాఫియాకు అడ్డాగా.. పీసీపల్లి:

నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో మైనింగ్ మాఫియా రోజురోజుకు రెచ్చిపోతుంది. మండలంలోని అధికార పార్టీ నాయకుడి కుమారుడు నేరేడుపల్లి, లక్ష్మక్కపల్లి, లింగన్నపాలెం, అడవిలోపల్లి, మెట్లవారిపాలెం, గుంటుపల్లి, తురకపల్లి, మురిగమ్మి గ్రామాల్లో అక్రమ మైనింగ్‌కి పాల్పడుతున్నారు.

అక్రమార్కులకు అధికారుల అండ..

రెవెన్యూ, మైనింగ్, అటవీ శాఖ అధికారుల అండతో మైనింగ్ మాఫియా జోరుగా తవ్వకాలు చేస్తున్నారు. కొండలను పిండి చేసి అడవుల్లో చెట్లను సైతం నరికేసి సుమారు 100 నుంచి 200 అడుగుల గుంతలు తవ్వి తెల్లరాయిని తవ్వుకుంటున్నారు. మండల పరిధిలోని మురుగమ్మిలో రెండు నెలల కాలంలో రెండు సార్లు అధికారులు దాడులు చేసి జరిమానా విధించారు.

లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి

ఒక్క పీసీపల్లి మండలంలోనే గడిచిన నెల రోజుల వ్యవధిలో సుమారు వెయ్యి టన్నుల మేర తెల్లరాయి తవ్వకాలు చేసినట్లు అంచనా. అనుమతి పొందిన వాటిలో చలానా రూపంలో ప్రభుత్వానికి వచ్చింది రూ.100 అయితే టీడీపీ నేతల జేబుల్లోకి చేరింది రూ.10 వేలకు పైనే ఉంటుంది. సంపద సృష్టి పేరితో అధికార నేతల అండతో విచ్చల విడిగా దోచుకుంటున్నారు.

మైనింగ్ ప్రాంతాలు ఇవే..

నియోజకవర్గంలోని బల్లిపల్లి, అడ్డరోడ్డు, చీర్లదిన్నె, బాల వెంకటాపురం, వెలిగండ్ల శివారు ప్రాంతాలు, నాగిరెడ్డిపల్లి, పీసీపల్లి మండలంలో గుంటుపల్లి, లక్ష్మక్కపల్లి, మురిగమ్మి, పామూరు మండలం మార్కోండా పురం, నాసికాత్రయంబకం తదితర ప్రాంతాల్లో రెవెన్యూ, ఫారెస్ట్ భూముల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.



అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు చేసిన దృశ్యం(ఫైల్)

సర్వేపల్లి స్ఫూర్తితో ముందుకు సాగాలి



కె.ఉప్పలపాడులో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు



వగ్గంపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ముప్పవరం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డికి సన్మానం

సీఎస్‌పురం(పామూరు): మాజీరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ స్ఫూర్తితో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి వృత్తికి పేరుప్రతిష్టలు తేవాలని అంబవరం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం షరీఫ్ అన్నారు. మండలంలోని అంబవరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమాజంలో పిల్లలను ఉత్తమ పౌరులుగా నిలబెట్టిన ఉపాధ్యాయులను ఎన్నటికీ మరువకూడదన్నారు.

కొండపి: సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఉపాధ్యాయుడని, దేశానికి ఎంతో సేవ చేశారని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. నూసన్న కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది,ప్రధానోపాధ్యాయుడు వి నూసన్న కుమార్ సన్మానించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, సింగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముప్పవరం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డిని, సీనియర్ ఉపాధ్యాయులు విజయశ్రీ, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లను సన్మానించారు. ఉపాధ్యాయులు రవీంద్ర, శ్రీదేవి, శ్రీలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

పామూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని వగ్గంపల్లె జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వీవీ నరసరాజు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారాన్ని పురస్కరించుకుని ముందస్తుగా గురువారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం వి.వి.నరసరాజు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాలలో గతంలో విధులు నిర్వర్తించి రిటైర్ అయిన హెచ్‌యంలు షేక్.మస్తాన్‌వలి, జి.శ్రీహరి, మహబూబ్ ముంతాజ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు యం.శ్రీనివాసరాజు, హస్తి వీరాంజనేయులు, రఘురామయ్యలను ఘనంగా సన్మానించారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు, కుర్చీల పోటీలు, క్యారం బోర్డు నిర్వహించారు. హెచ్‌ఎం నరసింహారావు, పీడీ షేక్ జిలానీబాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం



చిలంకూరులో బాబుష్యూరిటీ మోసంగ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నేతలు

పామూరు: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. మండలంలోని చిలంకూరు ఎస్సీ కాలనీలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రీకాల్ బాబూస్ మ్యానిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హుసేన్‌రెడ్డి, చప్పిడి సబ్బయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను, అరాచకాలను నిలదీస్తున్న వైఎస్సా ర్‌సీపీ వారిపై తప్పుడు కేసులు పెట్టి నానా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రెడ్‌బుక్ పేరుతో దాడులకు ఉసిగొల్పుతోందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగనన్నను ముఖ్యమంత్రి చేసే లక్ష్యంతోనే పనిచేయాలని, జగనన్న సీఎంగా ఉంటేనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్లి నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కూటమి నాయకులు సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన అబద్ధపు హామీల క్యూ ఆర్ కోడ్ పత్రాలను ప్రజలకు అందజేసి వారికి మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కంచర్ల మాలకొండయ్య పక్షవాతంతో బాధపడుతుండగా అతనికి మండల పార్టీ అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. కోఆప్షన్ సభ్యులు షేక్.నాయబ్‌రసూల్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరాం శ్రీను, ఎలికా అచ్చయ్య, మిరియం రామారావు, పరమేశ్వరరావు, పిరికిటి వెంకటనారాయణ, ఎంపీటీసీ సుబ్బరత్తమ్మ, ఎస్.వెంకటేశ్వర్లు, కోకటపల్లి మాధవరావు, కంచర్ల మల్లికార్జున, రోశయ్య, కోడూరి రామసుబ్బారెడ్డి, జె.ప్రహ్లాద, గంధం భాస్కర్, డీకాల ఎలాషా, దానియేలు, కార్తిక్, గంధం లీనస్, హైజాక్, డి.యోహోను తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఖాళీగా ఉన్న జువాలజీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 10వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు కాలేజీ వద్ద హాజరు హాజరు కావాలన్నారు,.

డంపింగ్ యార్డులకు మరమ్మతులు



చెరువుకొమ్ముపాలెంలో డంపింగ్ యార్డుకు కొత్తగా రేకులు బిగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డులపై ' ఉన్నా..ఉపయోగం సున్నా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు రెండు రోజుల క్రితం నిధులు మంజూరు చేసి గురువారం చెరువుకొమ్ముపాలెం లోని డంపింగ్ యార్డ్‌కు కొత్తగా ఇనుప రేకులను బిగించి వాడుకలోకి తీసుకొచ్చారు. మిగిలిన చెత్త కేంద్రాలను కూడా వినియోగంలోకి తెచ్చారు.

స్వచ్ఛ అవార్డులకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సీఎస్‌పురం(పామూరు): ప్రధానోపాధ్యాయులంతా ఈ నెల 15వ తేదీ లోగా స్వచ్ఛ పాఠశాల అవార్డులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరం జెడ్పీహెచ్‌ఎస్, చింతపూడి ఎంపీపీఎస్ పాఠశాలలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాల స్వచ్ఛ అవార్డులకు నమోదు చేయాలన్నారు. నాగులవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ, భోజన పథకం అమలులో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. పాత స్టాకు వెంటనే వినియోగించాలని సూచించారు. పాఠశాలల్లో వంటచేసే ప్రాంతం, భోజనం వడ్డించే, తినే ప్రాంతాల్లో పరిశుభ్రత ఉండేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్వచ్ఛ పాఠశాలలు, హరిత విద్యాలయాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. క్లస్టర్ హెచ్‌ఎం బుదాల డేవిడ్ ఉన్నారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్ న్నారు. వేలం సందర్భంగా గురువారం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలానికి తీసుకుని వచ్చే బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. క్లస్టర్ పరిధిలోని గుర్రప్పడియ, కె.అగ్రహారం, మూగచింతల, నెన్నూరుపాడు, చతుకుపాడ గ్రామాల రైతులు 704 బేళ్లను తీసుకురాగా 585 బేళ్లను కొనుగోలు చేసి 119 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.316, కనిష్ట ధర రూ.120, సరాసరి ధర రూ.199.82గా నమోదైంది. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.316 పలికిందని నిర్వహణాధికారి ఏ శ్రీనివాస రావు తెలిపారు. టంగుటూరు, జరుగుమల్లి, సాదువారిపాలెం, వావిలేటిపాడు గ్రామాల చెందిన 915 బేళ్లను వేలానికి తీసుకురాగా 713 బేళ్లను కొనుగోలు చేసి 202 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.125, సరాసరి ధర రూ.218.48గా నమోదైంది. వేలంలో 21 కంపెనీలు పాల్గొన్నాయి.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మత్స్యకారులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

సింగరాయకొండ: మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా మత్స్య శాఖాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాకల పంచాయతీ పోతయ్యగారి పట్టపుపాలెం, పల్లెపాలెంలో గురువారం మత్స్యశాఖ, ఆత్మ సంయుక్తంగా బోటు ఇంజన్ రిపేరు, చేపల అధిక ఉత్పత్తిపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. జిల్లా మత్స్య శాఖాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ సముద్ర నాచు మొక్కల పెంపకంతో పాటు సముద్రపు అలలపై చేపలను పెంచే పంజరాలు ఏర్పాటు చేయటం ద్వారా చేపల పెంపకం చేపట్టవచ్చన్నారు. దీంతో పాటు కాప్టివ్ ఫిష్ సీడ్ ఫాండ్స్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఎలా పొందాలో వివరించారు. ఇంజన్ టెక్నీషియన్ బాలకృష్ణ, మత్స్య, ఆత్మశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచేలా చర్యలు



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు

టంగుటూరు: విద్యార్థుల హాజరుశాతం పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈఓ కిరణ్ అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన గురుపూజోత్సవంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. సీనియర్ ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మహతి బాలాజీ, జిల్లా విద్యాశాఖ డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం సుధారాణి, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు



కేరళ సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పామూరు: ఓనం పండుగ ముందస్తు వేడుకలు స్థానిక సెయింట్‌మారీస్క్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ ఎం జయకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'నమ్మకం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం' గుర్తింపుగా కేరళవాసులు ఏటా ఓనం పండుగను నిర్వహిస్తారన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన కేరళ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అటవీ భూముల్లో వ్యవసాయం చేయరాదు



మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: అటవీ భూముల్లో వ్యవసాయం చేయరాదని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక వేలం కేంద్రంలో స్థిరమైన ప్రత్యామ్నాయాలు యూరోపియన్ గ్రీన్ డీల్ అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు సాగులో తీసుకోవాల్సిన సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులు, బాల కార్మికుల నిర్మూలన, పురుగుమందుల అవశేషాలు లేకుండా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడం, భూమి సారవంతం కాపాడుట గురించి వివరించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ ఉమామహేశ్వరరావు, పార్థసారథి, పోతుల నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

సింగరాయకొండ: ముందు వెళ్తున్న లారీని వెనక వేగంగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో కోనూరు వెంకట శేషగిరి(60) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గత నెల 27వ తేది గుంటూరు–2 టౌన్ లోని రామాపురం పంచాయతీ ఏటి అగ్రహారానికి చెందిన వెంకట శేషగిరి గుంటూరు నుంచి తిరుపతికి కారులో వెళ్తుండగా కారు జాతీయరహదారిపై మండలంలోని కలికవాయ గ్రామ పరిధిలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని కారు వెనకభాగం బలంగా ఢీకొట్టింది. ఘటనలో స్వల్ప గాయాలతో బయటపడ్డ వెంకట శేషగిరి గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.